www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023
5
చిత్తూరు



టీడీపీ పాపం.. మాపై రుద్దకండి

- నేను మంచివాళ్లకు ఎప్పుడూ ఫ్లవరే... చెడ్డవాళ్లకే ఫైర్...
- పచ్చపత్రికలో వచ్చిన కథనంపై మంత్రి రోజా ఆగ్రహం
- వాస్తవాలు తెలుసుకొని రాయాలంటూ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి

నియోజకవర్గంలో అభివద్ధి చతికిలబడిందంటూ పచ్చపత్రికలో వచ్చిన కథనంపై రాష్ట్రపర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నింద్ర మండలం కొప్పేడులో విలేకరుల సమావేశంలో ఆమె పచ్చపత్రికలు చేసిన అసత్య ప్రచారాన్ని ఎండగట్టారు. నిజానిజాలు తెలుసుకొని రాయాలంటూ వాస్తవాలను వెల్లడించారు. నేత కార్మికులకు 500యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని జగనన్న ఎన్నికల హామీ ఇవ్వలేదన్నారు. అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పామని ఆ మాట మేరకు నేతనన్న నేస్తంతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. యూనిఫామ్ ఆర్డరు ఇప్పించామని, అత్యాధునిక యంత్రాలు నడపడంపై శిక్షణ అందించామన్నారు. గత ప్రభుత్వం పవర్‌లూమ్ విద్యుత్‌ను కేటగిరీ 4 నుంచి 3కు మార్చేస్తే అది నేడు అమలులోకి వచ్చిందని ఆ కారణంగా విద్యుత్‌బిల్లు పెరిగిందన్నారు. అందుకే వారికి వచ్చే అదనపు ఛార్జీలు తగ్గిస్తున్నట్లు నగరి సభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని రాష్ట్ర వ్యాప్తంగా దానిని అమలు చేయడానికి ప్రక్రియ నడుస్తోందన్నారు. పుత్తూరులో నీరు నిల్వ అయ్యే ప్రాంతంలో సమ్మర్ స్టోరేజ్ నిర్మించక టీడీపీ నాయకులు చేతకానితనంతో స్వలాభం కోసం, కమిషనర్ల కోసం నీరు చేరని ప్రాంతంలో నాశిరకంగా కట్టేశారన్నారని, అది దాహం తీర్చడానికి కాక వాకింగ్ చేయడానకి మాత్రమే పనికి వస్తోందన్నారు. గతంలో అతిపెద్ద వర్షాలు వచ్చిన సమయంలోనే అది నిండినా నాశిరకంగా కట్టిన కట్ట కావడంతో అది తెగి ఊరు మునిగిపోయే పరిస్థితి వచ్చిందని దానిని బలపరచి రోడ్డు మంజూరు చేశానన్నారు. ప్రస్తుతం బోరు వేసి సమ్మర స్టోరేజికి నీటిని పంప్ చేస్తున్నామని ఈ కారణంగా ఖర్చు పెరిగిందన్నారు. గత ప్రభుత్వం తెలుగు గంగ నుంచి పైప్ లైన్ మంజూరు చేసినట్లు ప్రకటించినా భూముల సేకరణ, నీటి కేటాయింపు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పైప్‌లైన్ ప్రాజెక్టు ఏఐఐబీ ద్వారా రూ.139 కోట్లు మంజూచేస్తే శాశ్వత మంచినీటి సరఫరాకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతూ వస్తోందన్నారు. నియోజకవర్గంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు కట్టించామని. 100 పడకల ఆస్పత్రిని, పీహెచ్‌సీలను నవీకరించామని, వెల్‌నెస్ సెంటర్లు కట్టిస్తున్నామన్నారు. గొల్లపల్లి సచివాలయంలోని ఒక ఫ్లోర్‌లో తాము వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. నింద్ర నేటమ్స్ షుగర్స్ ప్రైవేట్ చెరకు ఫ్యాక్టరీ అని రైతులకున్న బకాయిలు గత ప్రభుత్వ హయాం నుంచి ఉందన్నారు. అప్పట్లో నిరశనలు వ్యక్తం చేసిన సమయంలో వారికి అనుకూల సామాజిక వర్గం వత్తాసు పలకిందన్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీవారు, ఫైనాన్షియరు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫైనాన్షియర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో దానిపై కార్మికులు కోర్టుకు వెళ్లారన్నారు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న చెరకు ఫ్యాక్టరీలకు సంబంధించి రైతులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇప్పించడం జరిగిందన్నారు. తాము చేసిన ప్రతిపని రికార్డు రూపంగా చెప్పగలమని చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. అబద్దాలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేదన్నారు. ఎదుటివారిని ఒక వేలెత్తి చూపితే నాలుగు వేళ్లు తమవైపు చూపుతోందని అసత్యప్రచారం చేసేవారు తెలుసుకోవాలన్నారు. ఐదేళ్లు సమయం ఉన్నా గత ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందని. రెండేళ్లు కోవిడ్‌తో గడచిపోయి మిగిలి ఉన్న కాలంలోనే తాము ఎంతో అభివద్ధి, సంక్షేమం అందించామన్నారు. చెప్పుకునేందుకు ఏ అభివద్ధి లేదు కనుకే పచ్చపత్రికల ద్వారా అసత్య ప్రచారాలుచేసి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది నమ్మడానికి ప్రజలు వెర్రివాళ్లు కాదన్నారు.

వీవోఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27వేల మంది వీవోఏలకు హెచ్‌ఆర్ పాలసీ, కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఐకెపి వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) మూడు జిల్లాల సమావేశం కాణిపాకంలో జీను రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వీవోఏలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ ఉన్న వాళ్ళని తొలగించడానికి సర్క్యులర్ 64ను తీసుకొచ్చి మూడు సంవత్సరాల కాలం పరిమితి పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలకు పొదుపుపై అవగాహన కల్పించి వారిని ఆర్థికంగా నిలదక్కుకోవడానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి వీవోఏలను రాష్ట్ర ప్రభుత్వం రకరకాల అడ్డదారుల్లో తొలగించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ చిత్తూరు జిల్లాలో వీవోఏలపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘసభ్యులు తీర్మానం లేకుండా ఇష్టారాజ్యంగా తొలగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. కానీ చిత్తూరు జిల్లాలో మాత్రం ఇష్టారాజ్యంగా తొలగిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలపై 64 సర్క్యులర్‌లో భాగంగా జెండర్ విధానాన్ని తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన పోరాటాల ఫలితంగా వేతనాలు కొద్దిగా పెరిగిన కనీసవేతనాలు అమలు కావడం లేదని వాటిని అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, సంఘాల మెర్జింగ్ విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మరో పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధమవుతున్నామని తెలిపారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు డిసెంబర్ 1 నుంచి కార్యక్రమాలు చేపడుతున్నామని ఈ కార్యక్రమాల్లో వీవోఏలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో సోమల, ఎస్‌ఆర్ పురం, ఇతర మండలాల్లో సంఘాల సభ్యులు తీర్మానం లేకుండా ఇష్టారాజ్యంగా తొలగిస్తున్న ఏపిఎంలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఆర్‌డిఏ పిడి వీవోఏల సమస్యలపై జిల్లా సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు రెడ్డప్ప, కష్ణమ్మ, పరంజ్యోతి, చిత్తూరు జిల్లా కార్యదర్శి పి.నాగరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు రాణి, తిరుపతి జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు శ్రీధర్ సుబ్రమణ్యం, అధిక సంఖ్యలో వీవోఏలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

జర్నలిస్టులకు హౌస్‌సైట్‌ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌సైట్ 23 నవంబర్, 2023న తెరవబడుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ఛైర్మన్ (డిఎంఎసి) ఎస్. షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి స్థలాలను కోరుకునే జర్నలిస్టులు తమ ఆన్‌లైన్ దరఖాస్తును సంబంధిత వివరాలతో తప్పనిసరిగా సమర్పించాలని ఆయన తెలిపారు. నమోదు కోసం వెబ్‌సైట్ (http://ipr. ap.gov.in) తెరిచిన తేదీ నుండి 45 రోజులు దరఖాస్తులను స్వీకరించబడునని, చివరితేదీ జనవరి, 6, 2024 అని పేర్కొన్నారు. జర్నలిస్టుల గహఅవసరాలను తీర్చడానికి ప్రభుత్వం జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్‌ను ప్రారంభించిందని, జీవో ఎంఎస్.నెం.535, రెవెన్యూ (భూములు.1) శాఖ, తేదీ: 11.11.2023న జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం రాష్ట్ర వ్యాప్తంగా 60శాతం ప్రభుత్వ సహకారం మరియు 40శాతం జర్నలిస్టు సహకారంతో ఖర్చు-భాగస్వామ్య నిష్పత్తితో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి గుర్తింపు పొందిన జర్నలిస్టుకు 3సెంట్ల చొప్పున సరసమైన ఇంటి స్థలాలను అందిస్తుందన్నారు. సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల శ్రేయస్సు కోసం ప్రభుత్వ నిబద్ధతను ఈ పథకం ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కమిషనర్, సమాచార పౌర సంబంధాలశాఖ, విజయవాడవారిచే ప్రాథమికంగా అక్రిడిటేషన్, దరఖాస్తుదారుని పని అనుభవం మొదలైనవి ధవీకరించబడిన అనంతరం జిల్లాకు అందుతాయని తెలిపారు. గుర్తింపు పొందిన జర్నలిస్టులందరూ ఈ పథకానికి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని, సమాజానికి జర్నలిస్టులు చేసిన విశేషమైన సేవలను గుర్తించడంలో ప్రభుత్వ చొరవను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా: జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో డూప్లికేట్, డెత్, జంక్ క్యారెక్టర్, 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న హౌసెస్ తదితర అంశాలపై అందిన క్లెయిమ్స్‌ను క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలచే క్షుణ్ణంగా పరిశీలన చేసి పారదర్శక ఓటర్ల జాబితా తయారీలో మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో మండల ప్రత్యేక అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి భారత ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. స్పెషల్‌సమ్మరీ రివిజన్‌లో భాగంగా అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రజాసంఘాల నుండి, వివిధ రాజకీయ పార్టీల నుండి అందిన ఫిర్యాదులకు సంబంధించి, జంక్ ఓటర్లు, డెత్, మల్టిపుల్ ఓటర్స్, డబుల్ ఎంట్రీస్, తదితర అంశాలలో క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా అందిన క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో విచారించి ఈనెల 23వ తేదీ సాయంత్రం లోపు అప్డేట్ చేసి పూర్తి చేయాలన్నారు.



'ఊపిరి' తీస్తున్న 'రొయ్య'

- జీవిఆర్ ఫ్యాక్టరీలో గబ్బుగబ్బు
- కిలోమీటర్ల దూరం దుర్వాసన
- కన్నెత్తి చూడని పొల్యూషన్ అధికారులు
- కార్మికుల పరిస్థితి దయనీయం



ప్రజాశక్తి - కోట

రాత్రుల్లో చల్లగాల్లుల్లో, మంచి సువాసనల మధ్య హాయిగా నిద్రపోవాలని అనుకుంటారు.. అయితే జీవిఆర్ రొయ్యల ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివాసితులు కిలోమీటర్ల దూరం ఏళ్ల తరబడి దుర్వాసన భరిస్తూ బతుకుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే గబ్బు వాసన వల్ల కార్మికులే కాదు, చుట్టుపక్కల ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పర్యావరణ అధికారులు ఆ ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం అయితే దుర్వాసనతో పాటు, వ్యర్థ నీరు సైతం కేశవరం చెరువులోకి, పక్క పొలాల్లోకి యథేచ్ఛగా వదిలేస్తారు. దీంతో ఆయా గ్రామాల్లో బోర్లు వేస్తే రంగునీరు వస్తుందని రైతులు వాపోతున్నారు. తిరుపతి జిల్లా కోట మండలంలోని చిట్టేడు, కేశవరం, మద్దాలి, రాఘవపురం, రామపురం, కొండూగుంట గ్రామాల దయనీయ స్థితి ఇది.

కోట మండలంలోని చిట్టేడు-కేశవరం గ్రామాల మధ్య మెయిన్‌రోడ్డు పక్కనే జీవిఆర్ రొయ్యల పరిశ్రమ ఉంది. ఈ రొయ్యల ఫ్యాక్టరీ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా పొలాల్లోకి, చెరువుల్లోకి కాలుష్య నీటిని వదిలేస్తున్నారు. అంతేకాదు రొయ్యల తలలు తీసి వ్యర్థ నీరు కనీసం క్లోరినేషన్ కూడా చేయడం మానేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో దుర్వాసన ముక్కుపటాలదిరేలా భరించలేని విధంగా తయారయ్యింది. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణం. ఈ ఘాటైన వాసనకు నిద్ర కూడా రావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఈ ఫ్యాక్టరీ నుంచి పొల్యూషన్ ఉన్నతాధికారులకు నెలనెలా ముడుపులు అందడం వల్లనే తమ బతుకుల గురించి ఆలోచించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే చిట్టేడు-కేశవరం గ్రామాల్లో కొంతమంది నాయకులు ఫ్యాక్టరీ నుంచి ముడుపులు తీసుకుని ఎటువంటి ఫిర్యాదు చేయనీకుండా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఫ్యాక్టరీకి సంబంధించిన సిఎస్‌ఆర్ నిధులు ఎక్కడికి మళ్లిస్తున్నారన్నది ప్రశ్నార్థకం. ఫ్యాక్టరీ చుట్టూ చెట్ల పెంపకం మరిచారు. క్లోరినేషన్ పనులు చేపట్టడం లేదు. కలెక్టర్, ఆర్డీవో, పొల్యూషన్ అధికారులు స్పందించి రొయ్యల పరిశ్రమ నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

వైసిపి పాలనలో పారదర్శకంగా అభివృద్ధి పనులు

జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వికోట: వైసిపి పాలనలో జిల్లా వ్యాప్తంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పారదర్శకంగా అభివద్ధి పనులు జరుగుతున్నాయని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. వికోట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పి.కొత్తూరు, గోవిందనగర్ గ్రామాల్లో జడ్పీ నిధులు నుండి మంజూరైన రూ.30లక్షల నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు బుధవారం వారు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకశ్రద్ధతో జిల్లా పరిషత్ నిధులు వెచ్చించి వివిధ అభివద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివద్ధి పనులలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వీరి వెంట చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ - సామాజికసేవ సలహాదారుడు అమర్నాథ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీసిటీని వరించిన అవార్డు

ప్రజాశక్తి-వరదయ్యపాలెందేశంలోని ప్రముఖ వ్యాపార ప్రచురణ సంస్థ వ్యాపార రంగంలో లోతైన విశ్లేషణకు ప్రసిద్ధి చెందిన బిజినెస్ వరల్డ్ నిర్వహించిన సస్టైనబుల్ వరల్డ్ కాన్క్లేవ్ అండ్ అవార్డ్స్ 5వ ఎడిషన్‌లో 'ఇండియాస్ మోస్ట్ ఇన్నోవేటివ్ సస్టైనబిలిటీ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును శ్రీసిటీ సొంతం చేసుకుంది. మంగళవారం సాయంత్రం ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బిజినెస్ వరల్డ్ ఛైర్మన్ అండ్ ఎడిటర్-ఇన్-చీఫ్ డాక్టర్ అనురాగ్ బాత్రా నుండి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ అవార్డును అందుకున్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఈవీఎంల పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలి..

ప్రతి బిఎల్‌ఓ క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా క్లైయిమ్స్‌ను విచారించాలి : జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్‌ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈవిఎంల పట్ల ఓటర్లలో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ నెలలో ఎన్నికల అధికారులు నిర్ణయించిన ప్రదేశాలకు ఈవిఎంలను పంపి అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. బుధవారం డిఆర్‌ఓ సమావేశపు మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కలిగి ఉండడం బాధ్యత అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. డిసెంబర్ నెలలో ఎన్నికల అధికారులు ఈవిఎంల ద్వారా ఓటు వేయడానికి ప్రజలకు తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ప్రధానంగా మొబైల్ యూనిట్‌లో కూడా డెమోనిస్ట్రేషన్ ఉంటుందని ఓటింగ్ ఏవిధంగా చేయాలని అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. మరణించిన వారి ఓటును ఓటరుజాబితా నుండి తొలగించుటకు కుటుంబ సభ్యులు తగిన దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జీరో డోర్ నెంబర్లు, డెత్ క్లెయిమ్‌లకు సంబంధించి సకాలంలో బిఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేయాలని, ఎవరైనా కుటుంబ సభ్యులు మరణించి ఉంటే వారి ఇంట్లోని ఇతరులు తప్పనిసరిగా ఫారం పూర్తిచేసి బిఎల్‌ఓలకు అప్పగించాలన్నారు. పారదర్శక ఓటరు జాబితా తయారీలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొదటి లెవెల్ ఈవీఎంల తనిఖీ పూర్తి అయిందని తెలిపారు. క్లైమ్‌లకు సంబంధించి డిసెంబర్ 9 వరకు అవకాశం ఉందని పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎంకు చెందిన గంగరాజు, టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతినిధి పరదేశి, ఎలెక్షన్ సూపరిండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ రికార్డులో చిత్తూరు యువకుడు



నీటిపై తేలియాడుతున్న విశాక్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నీటిపై ఎలాంటి చలనం లేకుండా నాలుగు గంటలపాటు ఉంటూ ఇండియా బుక్ రికార్డును చిత్తూరుకు చెందిన యువకుడు విశాక్ సొంతం చేసుకున్నాడు. దేశవిదేశాల్లో తన ప్రతిభతో ఆకట్టుకున్న చిత్తూరు యువకుడు ఇండియా బుక్కులో తన పేరును నమోదు చేసుకునేందుకు బుధవారం స్థానిక డాన్స్ హోటల్ స్విమ్మింగ్ పూల్‌లో 4 గంటల పాటు ఎలాంటి చలనం లేకుండా నీటిపై తేలేడుతూ రికార్డు నెలకొల్పారు. ఇది అరుదైన ఘట్టంగా ఇండియా బుక్ ప్రతినిధి హరీష్ తెలిపారు. తమ కుమారుడు ఇండియా బుక్‌లో పేరు నమోదు చేసుకోవడం పట్ల యువకుడి తల్లిదండ్రులు వెంకట మునిశెట్టి, శోభ ఆనందం వ్యక్తం చేశారు.

'ఆడుదాం- ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

ఎండిపివో మోహన మురళి



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన మురళి

ప్రజాశక్తి - కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో మోహనమురళీ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని డిఎం.పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి, అన్నూరు. సచివాలయాల్లో ఆడుదాం- ఆంధ్ర సర్వే కార్యక్రమంపై అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆడుదాం -ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించి ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాట్మింటన్ క్రీడలపై ఆసిక్తి కలిగిన వారిని గుర్తించాలని సూచించారు. నేటి నుంచి క్రీడాకారుల కోసం సర్వే చేసి 26వ తేదీ నుంచి ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చూడాలన్నారు. మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గం స్థాయి, అలాగే జిల్లా స్థాయిలో పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. ఎంఈవో-2 మనోజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, మాండవ్య, తిరుమల రాజు, గీత, మురళీ కష్ణమరాజు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈనెల 23న తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో నాలుగో విడత వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా లబ్ధి పంపిణీ కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంకు సంబంధించి జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ నుంచి ఉదయం 10.30 గంటలకు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పారదర్శకంగా ఇంజినీరింగ్ పోస్టుల నియామకం

నేడు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం
టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీటీడీలో భర్తీ చేయబోతున్న ఇంజినీరింగ్ పోస్టుల నియామక ప్రక్రియ ఎలాంటి సిఫార్సులకూ తావు లేకుండా పూర్తి పారదర్శకంగా జరుగుతోందని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో ఛైర్మన్, ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టులు భర్తీ చేసేందుకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో ఛైర్మన్‌కు, బోర్డు సభ్యులకు, అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులను కోరారు. చెన్నై ఐఐటి ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన ఈ నియామకాలు జరుగుతాయని వివరించారు. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వబోతున్న ఉద్యోగాల నియామక



విలేకరుల సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఈవో

ప్రక్రియను ఇదే తరహాలో పూర్తి పారదర్శకంగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేడు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం

అలిపిరిలోని సప్త గో ప్రదక్షిణ మందిరంలో నవంబర్ 23వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని టీటీడీ ప్రారంభించనున్నట్లు ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం నుండి నిరంతరాయంగా శ్రీవారి పాదాల వద్ద ప్రతి రోజూ ఈ హోమం నిర్వహిస్తారన్నారు. పెళ్లిరోజు, పుట్టిన రోజు , ఇతర విశేష రోజుల సందర్భంగా భక్తులు ఎవరైనా ఇక్కడికి వచ్చి హోమం చేసుకోవచ్చని తెలిపారు. రూ.1000 చెల్లించి గహస్తులు ఇద్దరు ఈ హోమంలో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రస్తుతానికి ఆఫ్ లైన్ లో 50, ఆన్ లైన్ లో 50 టికెట్లు ఇస్తున్నామని , శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక స్లాట్ ల విధానంలో టికెట్ల సంఖ్య పెంచుతామని చెప్పారు . ప్రతిరోజు ఉదయం 9 నుండి 11 గంటల వరకు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ హోమ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. హోమ ప్రాశస్త్యాన్ని తెలిపేందుకు వేద విద్యార్థులు, అధ్యాపకులు, కళా బందాలతో వేద విశ్వవిద్యాలయం నుండి గురువారం ఉదయం 7 గంటలకు ఊరేగింపుగా సప్త గో ప్రదక్షణ మందిరానికి చేరుకుంటారని వివరించారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బంగారం చోరీ కేసులో
అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



చోరీ కేసులో నిందితులను చూపుతున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు పట్టణంలో దొంగతనానికి పాల్పడిన తమిళనాడు రాష్ట్రం, తిరుచ్చికి చెందిన అంతరాష్ట్ర దొంగల ముఠాసభ్యులను అరెస్టు చేసి వారి నుండి రూ. 17లక్షల విలువ కలిగిన 440 గ్రాముల దొంగిలించబడిన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చిత్తూరు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఎస్. విశ్వనాథ్‌రెడ్డి, సబ్-ఇన్స్పెక్టర్స్ ఆఫ్ పోలీస్ మల్లికార్జున, బి.భారతి ఇతర సిబ్బందితో మూడు బందాలుగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలలో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం, తిరుచిరాపల్లిలో బతుకుతెరువు కోసం వచ్చి స్థిరపడిన వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం, ఖరగ్పూర్‌కు చెందిన ఒక అంతరాష్ట్ర దొంగల ముఠా చిత్తూరు పట్టణంలో సిందు టవర్స్ హోటల్ ఎదురుగ పార్క్ చేసిన కారు అద్దం పగులకొట్టి అందులో నుంచి కీర్తన ఫైనాన్సు కంపెనీకి చెందిన 38 ప్యాకెట్ల బంగారు నగలను దొంగిలించుకొని వెళ్లినట్లు గుర్తించారు. సదరు అంతరాష్ట్ర దొంగల ముఠాసభ్యులు హరీష్(24), జమున(54) ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి విచారించి వారి నుంచి రూ.17లక్షలు విలువ కలిగిన 440గ్రాముల దొంగలించబడిన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన దుండగుల కొరకు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో దొంగల అంతరాష్ట్ర దొంగల ముఠా బంగారు షాపులు, బ్యాంకులు, రద్దీ ప్రాంతాలలో, గోల్డ్ ఫైనాన్సు కంపెనీలు, బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్, ఏటిఎం కేంద్రాల వద్ద, హోటల్స్, అపార్ట్మెంట్లు, లాడ్జిల వద్ద కాపు కాస్తూ ఉమ్మడి కార్యాచరణ ద్వారా వ్యక్తుల దష్టి మరల్చి బ్యాగులు, విలువైన వస్తువులు దొంగతనం చేయడం, కార్ల అద్దాలు పగులకొట్టి చోరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజుల్లో బంగారు నగల చోరీ కేసును చేధించిన డీఎస్పీ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లి సమీపంలో సదుం నుండి సోమల వైపు వస్తున్న కర్ణాటకకు చెందిన బొలెరో లగేజీ వాహనం బుధవారం సాయంత్రం రోడ్డుపై అదుపుతప్పి పక్కనే ఉన్న రాళ్లను ఢీకొని బోల్తా పడింది. ఈప్రమాదంలో వాహనంలో ఉన్న ముగ్గురికి గాయాలు కాగా వారిని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం.

తహశీల్దార్‌గా జయంత్ నియామకం

ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండల తహశీల్దారుగా జయంత్‌ను నియమించినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయంత్ గతంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా వెదురుకుప్పం తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉన్నారు. అయితే ప్రస్తుతం తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు.

సరస్వతి దేవి చిత్రపటం వితరణ



ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వవిద్యార్థి దాత చెంచురాజు సరస్వతి దేవి చిత్రపటంను వితరణగా ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్‌కు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ నైతిక విలువలు భక్తి భావం బంధించుకోవాలని పేర్కొన్నారు. దాతను విద్యార్థులు ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకమరాజు, జ్ఞానప్రసాద్, వెంకటేశు, గోపి, విజయ్ కుమార్, విజయవర్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శంకర్ నేత్రాలయ హాస్పిటల్ చెన్నై వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న 48 మందిని డాక్టర్లు పరిశీలించి 18మంది కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని చెన్నైలోని శంకర్ నేతాలయ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించడంతోపాటు వారికి రానుపోను ఖర్చులు అందించనున్నట్లు తెలిపారు. డాక్టర్ అరున్ కుమార్, తీర్థం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి కాలువ పనులు ప్రారంభం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామం క్లస్టర్ నెంబర్ ఐదు రెడ్డప్ప కాలనీలో జిజిఎంపి గ్రాండ్స్ కింద మురుగునీటి కాలువల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ జ్యోతి శ్రీనివాసులు మాట్లాడుతూ గడపగడప ప్రోగ్రాంలో ఎమ్మెల్యే, ఎంపీపీ రెడ్డప్ప, డిసిసిబి బ్యాంక్ ఛైర్‌పర్సన్ కష్ణమూర్తి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్తులు మరియు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ కేశవులు, జడ్పీ హైస్కూల్ ఛైర్మన్ మునే గౌడు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి

ప్రజాశక్తి- నగరి: రైతు భరోసా సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జె.మురళి కష్ణ అన్నారు. బుధవారం నగరి వ్యవసాయ కార్యాలయంలో డివిజన్‌లోని వ్యవసాయ అధికారులందరితో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అమలు, వ్యవసాయ అధికారులు, రైతుభరోసా సిబ్బంది పనితీరు గురించి చర్చించారు. రైతుభరోసా సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎరువులను రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందించాలన్నారు. అన్ని సమయాల్లోను రైతులకు అందుబాటులో ఉండాలని వారి సందేహాలను నివత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఆరు మండలాల వ్యవసాయాధికారులు ఎం.రాఘవేంద్ర యాదవ్, ఢిల్లీప్రసాద్, తులసిరామ్, రజిని, నర్మదా, వందన పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం



ప్రజాశక్తి- పులిచెర్ల: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఇన్చార్జ్ ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. కల్లూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్‌క్రాఫ్ట్ ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీఓ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన పర్యావరణ సమతుల్యం ఏర్పడి సకాలంలో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కలు పెంపకం వలన కలిగే ప్రయోజనాలు, పర్యావరణానికి ఏవిధమైన ఉపయోగాలు కలుగుతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీవాణి, ఎన్జిసి డివిజన్ కన్వీనర్ రాజేంద్ర, ఎన్జిసి గ్రీన్‌మాస్టర్ వెంకట సిద్ధులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపి చేరిక



ప్రజాశక్తి- శాంతిపురం: తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గ ప్రజలకు, గ్రామాలకు, పట్టణానికి చేసిన అభివద్ధిని ప్రజలకు వివరిస్తూ లక్ష ఓట్ల మెజారిటీయే లక్ష్యంగా పనిచేసే దిశగా టిడిపి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ 'గతం గుర్తు చేసుకుందాం.. బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని అబకలదొడ్డి పంచాయతీలోని పలు గ్రామాలలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పర్యటించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అబకలదొడ్డిలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి అబకలదొడ్డి పంచాయతీకి చెందిన రాయల్ బుజ్జీ, పలువురు వైసిపి కార్యకర్తలను టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి ప్రభుత్వం గడచిన నాలుగున్నర ఏళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అబకలదొడ్డి పంచాయతీకి గ్రామానికి తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివద్ధిని వివరిస్తూ ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. మండల పార్టీ ప్రెసిడెంట్ విశ్వనాథ్ నాయుడు, కార్యదర్శి నాగరాజు, విజయరామిరెడ్డి, ఏఎంసి నాగరాజు, చంద్రశేఖర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ బసవరాజు, మాజీ ఎంపిటిసి మాజీ సర్పంచ్ వెంకటేష్, ఆంజనేయ రెడ్డి, రామచంద్ర నాయుడు, శ్రీనివాసులు, డాక్టర్ వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే చంద్రబాబు రావాలి
మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు

గుడిపల్లి: మండలం ఓ.ఎన్.కొత్తూరు గ్రామపంచాయతీలో మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు ఆధ్వర్యంలో అభివద్ధి సంక్షేమ పథకాలు కావాలంటే రాష్ట్రంలో చంద్రబాబు రావాలి అనే నినాదంతో పంచాయతీలోని గ్రామాల్లో ప్రతిఇంటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే చేసే సంక్షేమ పథకాలు అభివద్ధి పథకాలు గురించి వివరించారు. టిడిపి నాయకులు మునుస్వామి, లోకేష్, నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న బెటప్ప నాయుడు

నృత్య పోటీలలో
'నోబుల్' విద్యార్థులకు మొదటి బహుమతి



ప్రజాశక్తి- శాంతిపురం : తమిళనాడు రాష్ట్రం చెన్నై మహానగరంలో జాకీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కతిక నృత్య పోటీలలో పలు రాష్ట్రాల నుండి వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నృత్యపోటీలలో నోబుల్ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ ఛైర్మన్ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, డాన్స్ మాస్టర్ సురేష్ ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సంజీవరాయశర్మ జయంతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

మండలంలోని మంగళపల్లి ఉన్నత పాఠశాలలో ప్రముఖ గణిత అవధాని, గణితవేత్త అయిన లక్కోజు సంజీవరాయశర్మ జయంతి వేడుకలను పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్రఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, సంజీవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో భాగంగా తొమ్మిదవ తరగతి విద్యార్థి పునీత్‌సాయి లక్కోజు సంజీవరాయ శర్మ వేషధారణలో నమూనా గణిత అవధానాన్ని నిర్వహించి ప్రేక్షకులు అడిగిన గణిత ప్రశ్నలకు అద్భుతరీతిలో సమాధానాలు చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజ్యలక్ష్మి మాట్లాడుతూ శర్మగారి జీవితం పట్టుదల, అవధాన విద్యలు ఆయన చూపిన నైపుణ్యం విద్యార్థులందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ మన తెలుగువాడైన సంజీవరాయ శర్మ గణిత అవధాన విద్యలో ఎంతో ప్రతిభ చూపినప్పటికీ తగిన రీతిలో ఆయనకు కీర్తి రాలేదని అందుకే మాథ్స్‌ఫోరం తరపున ఆయన జీవిత విశేషాలను గణిత ప్రతిభను చాటాలని ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఆయన జయంతిని ఘనంగా జరపాలని నిర్ణయించి పిలుపునిచ్చిందని తెలియజేశారు. ఉపాధ్యాయులు రమాదేవి, సంపంగి పిల్లారప్ప, ప్రేమకష్ణ మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములో సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి: జనసేన, టిడిపి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని టీకేఎం పురం పంచాయతీ టీఆర్ఎస్‌పురం గ్రామం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని జనసేన గంగాధర నెల్లూరు నియోజకవర్గ బాధ్యులు పొన్న యుగంధర్, మండలం టిడిపి ట్రస్ట్ ఇన్చార్జి మోహన్ మురళి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పొన్న యుగంధర్ మాట్లాడుతూ టికేయంపురం గ్రామానికి కేటాయించిన జగనన్న కాలనీలో ఉన్న మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరు ప్రవేశించరాదని, సూచిక బోర్డును ఏర్పాటు చేసి భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వభూమిని కాపాడాలని కోరారు. ఆ భూమని గ్రామంలో ఇంటిస్థలం లేని వారిని గుర్తించి వారికి స్థలంతో పాటు పట్టాలను అందచేయాలని కోరారు.



భరత్‌ను కుప్పం ఎమ్మెల్యేగా గెలిపించండి...!



ప్రజాశక్తి- రామకుప్పం: రాబోయే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపించాలని ఆయన సతీమని దుర్గా భరత్ కోరారు. మండల పరిధిలోని గుంటూరు తండా పంచాయతీ, పెద్దతండా పంచాయతీ గ్రామాల్లో ఎమ్మెల్సీ సతీమణి దుర్గ పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాభివద్ధి ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం కషి చేస్తుందని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్సీ భరత్‌ను ఆశీర్వదించాలన్నారు. ప్రతి ఇంటికి లక్ష నుండి 5లక్షల వరకు లబ్ధి పొందారని ఇలాంటి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత మనమందరం తీసుకోవాలని వివరించారు. స్టేట్‌పోలీస్ డైరెక్టర్ నాగమ్మ చెంగప్ప, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, కేశవరెడ్డి, సర్పంచ్ మోహన్ నాయక్, భాస్కర్ నాయక్, ఎంపీటీసీ రవి నాయక్, మహిళ అధ్యక్షురాలు మునెమ్మ పాల్గొన్నారు.

రోజూ స్టాకును సరిచూసుకోండి

మద్యం డిపో సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకష్ణ శాస్త్రి

ప్రజాశక్తి- నగరి

ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్వైజర్లు ప్రతిరోజు అమ్మకాల అనంతరం మద్యం స్టాకును సరిచూసు కోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకష్ణ శాస్త్రి సూచించారు. చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు, డిపో ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు బుధవారం నగరి పట్టణంలో గల వివిధ ప్రభుత్వమద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం, బీరు సీసాలను ప్రతిరోజు సూపర్వైజర్లు సరి చూసుకుంటుంటే స్టాకుల్లో ఎలాంటి తేడాలు ఉండవన్నారు. ఎమ్మార్పీ రేట్లకే మద్యం ప్రియులకు మద్యం విక్రయించాలని తాము నిర్వహిస్తున్న డెకాయ్ ఆపరేషన్‌లో ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్లు కనుగొంటే సంబంధికులపై కేసులు తప్పవని హెచ్చరించారు. బాటిల్ టు బాటిల్ తనిఖీ చేయాల్సిందిగా సంబంధిత వెరిఫికేషన్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఆ విధంగా చేయడం వల్ల సంబంధిత సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. ఆన్లైన్ ఆప్ ద్వారా నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీలో వెరిఫికేషన్ ఆఫీసర్ రాజశఖరరెడ్డి, సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమాల డిస్ప్లే బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి- నగరి : రాష్ట్ర ప్రజల సంక్షేమమే అభివద్ధి అని నిరూపించిన ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని మంత్రి సోదరులు వై.రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా నగరి మండలం వీకేఆర్‌పురం గ్రామంలో పార్టీ జెండాని ఆవిష్కరించి సచివాలయ పరిధిలో చేసిన అభివద్ధి సంక్షేమాలు వివరించే డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి పర్యటించి ప్రతి ఒక కుటుంబ సభ్యులను పలకరిస్తూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకొని వివరాలను సేకరించి తదుపరి మండల వైఎస్ఆర్సిపి నాయకులుతో గ్రామానికి కావలసిన అభివద్ధి పనులు పరిష్కరించవలసిన సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికేఆర్ పురం సచివాలయ పరిధిలోనే రూ.25.05కోట్ల అభివద్ధి జరిగిందన్నారు. ఇది ప్రతి ఒక్కరికీ తెలియాలనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, ఆర్బీకే ఛైర్మన్ బుజ్జిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హరి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సోమల: మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండలస్థాయి ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ బాషమసూద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ కందూరు పంచాయతీలో ఇంతటి అభివృద్ధిచేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తిరిగి వచ్చే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిపించి వారి నాయకత్వాన్ని నిలబెట్టాలని కోరారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ అమాస మోహన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, మెకానిక్ భాష ప్రజలు పాల్గొన్నారు.

'ఆదికేశవ'కి అమ్మవారి ఆశీస్సులు

ప్రజాశక్తి- పులిచెర్ల

ఈనెల 24న విడుదల కానున్న ఆదికేశవ మూవీకి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఏఎంసి డైరెక్టర్ వంశీకష్ణ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు విరూపాక్షమ్మ ఆలయంలో బుధవారం ఆదికేశవ డైరెక్టర్ శ్రీకాంత్ స్నేహితుడు ఏఎంసి డైరెక్టర్ వంశీకష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదికేశవ మూవీ విజయవంతం కావాలని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. విజయ్‌కుమార్, విక్రమ్, రెడ్డిరూపేష్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

5 అడుగుల నేల...హాంఫట్

పాఠశాల స్థలం దర్జాగా కబ్జా

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి పట్టణ పరిధిలోని 24వవార్డు పరిధిలోని పాతకోట ఈస్ట్ ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతోంది. పాఠశాల వెనుక భాగంలో నివసిస్తున్న కసరు కోటేశ్వరరావు పాఠశాల ప్రహరీగోడను తొలగించి మూడు అడుగులు లోపలకు వెళ్ళి తన నిర్మాణాన్ని చెపట్టాడు. పాఠశాల ఆవరణంలో తన సెప్టిక్‌ట్యాంకును ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా వాడుకుంటున్నాడు. నడిరోడ్డులో బోరు వేసుకున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఇంత జరుగుతున్నా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాశాఖాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో



స్కూలు స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతూ...


ఆక్రమణదారుడు రెచ్చిపోయాడు. కూతవేటు దూరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నివాసం ఉన్నా తనకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో అతని అండదండలూ పుష్కలంగా ఉన్నాయని స్థానికుల్లో అనుమానం రెకెత్తిస్తోంది. ఇదే వరుసులో ఉన్న పాఠశాల వెనుక భాగాన ఇంటి నిర్మాణాల వరుసలు గమనిస్తే ఇతను ఆక్రమించినట్లు స్పష్టంగా కనబడుతోంది. స్థానికుల ఫిర్యాదుతో కదిలిన విద్యాశాఖాధికారులు ఈస్థలం వెంకటగిరి రాజాలు దానం చేశారని , దీనికి సంబంధించి డాక్యుమెంట్ తమ వద్ద లేదని, ఈ ఆక్రమణ వ్యవహారాన్ని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. దాదాపు ఐదు అడుగులు పాఠశాల ఆక్రమణ గురవడం గమనార్హం.

ఎప్పుడొచ్చేదో.. ఎప్పుడుపోయేదో.!

- ఆర్టీసీ బస్సు కోసం ప్రయాణికులు, విద్యార్థులు పడిగాపులు
- వారం నుంచి రాకపోకలు బంద్
- అధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి-విజయపురం

మారుమూల ప్రాంతం.. తమిళనాడుకు సరిహద్దుకు దగ్గరగా ఉంటుంది.. ఆ గ్రామాలకు ఉన్నది ఒకే షటిల్ సర్వీస్.. వారంగా ఆ బస్సు రాకపోకలు నిలిపోయాయి. ప్రయాణిలు, విద్యార్థులు కళాశాలకు, పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నగరి, బుగ్గ



అగ్రహారం, కేవిపురం, నల్లటూరు, ఇల్లత్తూరు, పాతర్కాడు, ఆర్కాడు, కనకమ్మసత్రం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ మీదుగా ఉదయం, సాయంత్రం పుత్తూరు ఆర్టీసి డిపో నుంచి షటిల్ సర్వీస్ తిరిగేది. అయితే వారం రోజుల నుంచి బస్సు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికుల ఆరోపణ. పుత్తూరు డిపో మేనేజరు నిర్లక్ష్యం, అలసత్వం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.